సాక్షి
నిజామాబాద్
సోమవారం ¦ 8 ¦ మే ¦ 2023



తడిసిన ధాన్యం కొనుగోలు

అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు.

- 9లో ▸



ఆపదలో అండగా రెడ్‌క్రాస్

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ.. చేయూత అందించడంలో రెడ్‌క్రాస్ సొసైటీ ముందుంటుంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /26.4

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సర్పంచుల ఆత్మహత్యలు బాధాకరం..

■ ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని ఎంపీ అర్వింద్ ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాక చాలామంది సర్పంచులు అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. సకాలంలో బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి సమస్యలు న్యాయమైనవని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోగా, కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా ఇతర పథకాలకు మళ్లిస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయంగా మనుగడ సాధించలేననే సందర్భంలోనే సీఎం కేసీఆర్ నిధులు విడుదల చేస్తారని, అందుకోసం సర్పంచులంతా ఏకం కావాలని సూచించారు. బీఆర్‌ఎస్‌పై రాజకీయంగా తిరుగుబాటు చేయాలన్నారు. సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. ఇక బంగారు తెలంగాణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

కూలిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ భవనం



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని రైతుబజార్ వద్ద గల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ భవనం ఆదివారం ఉదయం కూలింది. ఈ సమయంలో భవనంలో సిబ్బంది లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. శనివారం రాత్రి సిబ్బంది రూట్ వాచ్‌కు వెళ్లడంతో విధులకు రాలేదు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ టీవీఎస్ ఎక్సెల్‌పై సిమెంట్ పెచ్చులు ఊడిపడడంతో వాహనం ధ్వంసమైంది.

ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

సుభాష్‌నగర్: ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు మెడికల్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్–2023 పరీక్ష ఆదివారం ముగిసింది. జిల్లాలో 10 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5.20 వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 3,183 మంది అభ్యర్థులకు గాను 3,142 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారు. ప్రత్యేక అవసరాలు గల అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిబంధనల ప్రకారం గంట ఐదు నిమిషాల సమయం అదనంగా ఇచ్చినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జిల్లా కో–ఆర్డినేటర్ భాస్కర్ మెరిగ తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకులపై పరువు నష్టం కేసు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బీఆర్‌ఎస్ నాయకులపై పరువు నష్టం కేసు నమోదైంది. బీఆర్‌ఎస్ నాయకులు గెరిగెంటి లక్ష్మీనారాయణ, ఫిరంగి రాజేశ్వర్, నిట్టు సురేందర్ రావులపై కేసు నమోదైంది. 2020 నవంబర్‌లో బీజేపీ నాయకుడు కాటిపల్లి వెంకట రమణారెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తూ ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపుల్లో అసత్య ప్రచారం చేసినందుకు బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో వెంకట రమణారెడ్డి కామారెడ్డి కోర్టులో పరువు నష్టం కింద క్రిమినల్ కేసు దాఖలు చేశారు. ప్రాథమిక సాక్ష్యాలు పరిశీలించిన అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు కేసును మోదు చేసి వారికి సమన్లు జారీజేయాలని ఆదేశించింది.

విత్తన లోపం..!



డొంకేశ్వర్ మండలం గాదెపల్లి నర్సరీలో మొలకలు రాని దృశ్యం

- సక్రమంగా నీళ్లు పట్టినా రాని మొలకలు
- జిల్లాలో సగానికిపైగా నర్సరీల్లో ఇదే పరిస్థితి
- మళ్లీ విత్తనాలు వేసిన అధికారులు
- హరితహారానికి మొక్కల కొరత ఏర్పడే అవకాశం



డొంకేశ్వర్(ఆర్మూర్): హరితహారం కోసం ప్రభుత్వ నర్సరీల్లో పెంచుతున్న మొక్కల్లో ఎదుగుదల లోపించింది. విత్తన లోపం కారణంగా చాలాచోట్ల మొలకలు రాలేదు. దీంతో సగానికి పైగా నర్సరీల్లో మట్టి నింపిన పాలిథిన్ బ్యాగులే కనిపిస్తున్నాయి. ఇటీవల కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కూడా నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ నర్సరీని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విత్తనాలు మొలకెత్తకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికైనా నర్సరీలను చక్కదిద్దకుంటే హరితహారానికి మొక్కల కొరత ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది. హరితహారం కోసం జిల్లాలో పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఈ నర్సరీలను నిర్వహిస్తోంది. అయితే, తొమ్మిదో విడత కార్యక్రమం కోసం జిల్లాలో 63.60లక్షల మొక్కలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం గతేడాది డిసెంబర్‌లోనే నర్సరీలను సిద్ధం చేశారు. కూలీలతో పాలిథిన్ బ్యాగుల్లో మట్టి నింపి కానుగ, చింత, జామ, బొప్పాయి తదితర రకాల విత్తనాలను వేశారు. అయితే, పలు మండలాల్లోని నర్సరీల్లో విత్తనాల లోపం కారణంగా ఎంత నీళ్లు పట్టినా మొలకెత్తలేదు. సగానికి పైగా నర్సరీల్లో 60 శాతం మాత్రమే మొక్కల ఎదుగుదల కనిపిస్తోంది. అధికారులు చేసిన తప్పుకు లక్షల విత్తనాలు వృథా అయ్యాయి.

పంచాయతీకార్యదర్శులు లేక నిర్వహణ గాలికి..

పంచాయతీ కార్యదర్శులు సమ్మెలోకి వెళ్లడంతో జిల్లాలోని నర్సరీల నిర్వహణ గాడి తప్పింది. పట్టించుకునే వారు లేకపోవడంతో మొక్కలు ఎండుతున్నాయి. ఇటు గులాబీ, మందారా, గన్నేరు, పేపర్ ఫ్లవర్ లాంటి అంటు మొక్కలు సైతం పెరగడం లేదు. అయితే, కార్యదర్శులు ఇప్పట్లో సమ్మెను విరమించే పరిస్థితి కనిపించడం లేదు. నిరంతర పర్యవేక్షణ చేసి కూలీలతో నీళ్లు పట్టించేవాళ్లు కరువయ్యారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి నర్సరీల్లోని మొక్కలను కాపాడాల్సిన అవసరం ఉంది.

కొత్త విత్తనాలు వేసి..

హరితహారం కార్యక్రమం ప్రారంభమయ్యేందుకు మరో 45 రోజుల సమయం మాత్రమే ఉంది. విత్తనాలకు మొలకలు రాకపోవడం, వచ్చినా అవి సక్రమంగా పెరగకపోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. సమయానికి మొక్కలు అందించకపోతే ఇబ్బందుల్లో పడతామని భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని నర్సరీల్లో మొక్కల పరిస్థితిపై వీడియోలను తెప్పించుకున్నారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో త్వరగా పెరిగే కొత్త విత్తనాలు దాదాపు 8 లక్షల వరకు వేశారు. ఇందుకు మునగ చెట్లను ఎక్కువ సంఖ్యలో పెంచాలని భావిస్తున్నారు. అయినప్పటికీ మొక్కలు సరిపోకపోతే గ్రామ పంచాయతీలతో కొనుగోలు చేయించి తెప్పించాలని చూస్తున్నారు.

పెరగని చోట కొత్త విత్తనాలు వేశాం

జిల్లాలో కొన్ని నర్సరీల్లో మాత్రమే విత్తనాలు మొలకెత్తలేదు. అలాంటి వాటిని గుర్తించి అక్కడ కొత్త విత్తనాలు వేయించాం. మొక్కలు త్వరగా ఎదిగేలా నిత్యం నీళ్లు పట్టేలా చర్యలు చేపడుతున్నాం. హరితహారానికి మొక్కల కొరత రాకుండా చూస్తాం.

– చందర్ నాయక్, డీఆర్‌డీవో, నిజామాబాద్

ఆర్టీసీ స్థలాల్లో బంకులు

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఐదు ఫిల్లింగ్ స్టేషన్‌ల ఏర్పాటు
- మరో ఎనిమిది చోట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- స్థలాలను పరిశీలించిన ఆర్‌ఎం

ఖలీల్‌వాడి: ఆదాయం సమకూర్చుకోవడం కోసం ఆర్టీసీ వివిధ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా డిపోల పరిధిలో ఆర్టీసీ స్థలాలను రోడ్డు రవాణా సంస్థ అద్దెకు ఇస్తోంది. ఇప్పటికే బస్టాండ్లలోని షెట్టర్లతో పాటు నేషనల్ హైవే ప్రాంతాల్లో ఉన్న స్థలాలను అద్దెకు ప్రతి ఏడాది టెండర్లు నిర్వహిస్తుంది. స్థలాల్లో మడిగెలు నిర్మించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే మరింత ఆదాయం సమకూర్చుకునేందుకు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటికే ఐదు ఏర్పాటు చేయగా, మరో ఎనిమిది ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌ఎం ఉషాదేవి స్థలాలను పరిశీలించారు.

ఆర్టీసీకి ఆదాయం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే ఐదు ఆర్టీసీ స్థలాల్లో పెట్రోల్ బంకులు నిర్మించారు. వీటి ద్వారా ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది. ఉమ్మడి జిల్లాలోని బీర్కూర్, భిక్కనూరు, బిచ్కుంద, ఇందల్వాయి, లింగంపేట్ మండలంలో పెట్రోల్ బంక్‌లున్నాయి. బంక్‌లు ఏర్పాటు చేసిన స్థలాలను లీజ్‌కు ఇచ్చిన తర్వాత ఈ బంక్‌లో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు పర్సెంటేజ్ తీసుకుంటారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుంది.

ప్రత్యేక వింగ్ ఆధ్వర్యంలో..

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ల నిర్మాణం కోసం ప్రత్యేకంగా వింగ్ ద్వారా ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మరో ఎనిమిది పెట్రోల్ బంక్‌లు ప్రతిపాదనలు చేశారు. నవీపేట్, డిచ్‌పల్లి, వేల్పూర్, జాన్కంపేట్, బోధన్, ఆర్మూర్, మోర్తాడ్, జక్రాన్‌పల్లిలలో పెట్రోల్ బంక్‌లకు ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని స్థలాన్ని పది రోజుల క్రితం ఆర్‌ఎం ఉషాదేవి పరిశీలించారు.

ప్రతిపాదనలు పంపాం

ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు పంపాం. ఆర్టీసీ డిపార్ట్‌మెంట్‌లోని ఒక వింగ్ వీటిని పర్యవేక్షిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు నివేదిక అందించాం.

– ఉషాదేవి, రీజినల్ మేనేజర్, నిజామాబాద్



డిచ్‌పల్లిలో ఆర్టీసీ బస్టాండ్‌లోని స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎం ఉషాదేవి (ఫైల్)

ఏఈఈ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్ అర్బన్: టీఎస్‌పీఎస్సీ ద్వారా ఈ నెల సోమ, మంగళవారాల్లో జరుగనున్న ఏఈఈ రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి కంటే అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి ఉండదన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలాక్ట్రానిక్ వస్తువుల అనుమతి లేదని పేర్కొన్నారు.

చర్చలు సఫలం..

- నేటి నుంచి రైస్‌మిల్లుల్లో ధాన్యం దిగుమతి యథాతథం
- అధికారులు, రైస్‌మిల్లర్ల మధ్య రోజంతా విస్తృతంగా చర్చలు



రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ధాన్యం దిగుమతిని నిలిపేసిన రైస్ మిల్లర్లతో కలెక్టర్, అదనపు కలెక్టర్, పౌరసరఫరాలశాఖ అధికారులు ఆదివారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సోమవారం నుంచి ఎఫ్ఏక్యూ వచ్చిన ధాన్యం యధాతథంగా దిగుమతి చేసుకుంటామని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. తడిసిన, మొలకెత్తిన, రంగుమారిన ధాన్యం దిగుమతి చేసుకోవడం సాధ్యం కాదని రైస్‌మిల్లర్లు స్ట్రైక్ చేసిన విషయం తెలిసిందే. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైస్‌మిల్లర్లు దిగుమతి నిలిపేయడాన్ని జిల్లా మంత్రి, కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ధాన్యం కాంటాలు నిలిచిపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే ఉద్దేశంతో రోజంతా రైస్‌మిల్లర్లతో చర్చలు జరిపారు. జిల్లాలో 458 కొను గోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 20రోజులుగా జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో కల్లాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతుల ఆందోళనల దృష్ట్యా తడిసిన ధాన్యాన్ని 26 బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం రావడంతో వారు చేతులెత్తేశారు. చేసేది లేక అధికారులు రా మిల్లులపై ఒత్తిడి తెచ్చారు. దీన్ని ఆసరాగా చేసుకుని చాలామంది రైస్‌మిల్లర్లు కడ్తాకు తెరలేపారు. 8 కిలోల వరకు తరుగు తీస్తుండడం, అధికారులకు అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో రైస్‌మిల్లర్లపై చర్యలకు పూనుకున్నారు. ఇప్పటికే ఒక రైస్‌మిల్లును బ్లాక్‌లిస్టులో పెడుతున్నట్లు అదనపు కలెక్టర్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మరో నాలుగైదు మిల్లులను కూడా బ్లాక్‌లిస్టులో పెట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. రైస్‌మిల్లర్లు ఆందోళన చెంది ధాన్యం దిగుమతులను నిలిపేశారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో..

ధాన్యం దిగుమతులు నిలిపివేస్తున్నట్లు రైస్‌మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించడంతో కలెక్టర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం దిగుమతిని ఆపొద్దని, వెంటనే దించుకోవాలని ఆదేశించారు. దీంతో రైస్‌మిల్లర్స్ కొంత పునరాలోచనలో పడ్డారు. అనంతరం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మరోసారి సమావేశమయ్యారు. సమావేశపు నిర్ణయాలను ఆదివారం సాయంత్రం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. వారితో జరిపిన చర్చలు సఫలీకృతమయ్యాయి. అధికారుల నిర్ణయానికి సంతృప్తి చెందిన రైస్‌మిల్లర్లు ఎఫ్ఏక్యూ వచ్చిన ధాన్యాన్ని యధాతథంగా దించుకునేందుకు ఒప్పుకున్నారు. ఈమేరకు అసోసియేషన్ ప్రతినిధులు పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

తడిసిన, మొలకెత్తిన ధాన్యంపై మెలిక!

అకాల వర్షాలకు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కొంత మొలకెత్తగా, మరికొంత రంగు మారింది. ఈ ధాన్యం దిగుమతికి కొందరు రైస్‌మిల్లర్లు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో కొంత మెలిక పెట్టినట్లు తెలుస్తోంది. తడిసిన ధాన్యం దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం, అధికారులు మాటగానే చెబుతున్నారని, అధికారికంగా జీవో ఇవ్వడం లేదని రైస్‌మిల్లర్లు పేర్కొంటున్నారు. తడిసిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం దిగుమతితో మిల్లులు నష్టాల పాల య్యే ఆస్కారముందని, ఈవిషయంలో ప్రభుత్వం పునరాలోచించి అధికారికంగా ఆదేశాలివ్వాలని వారు కోరుతున్నారు. అయితే సమస్య పరిష్కారం కో సం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమ వారం మంత్రి గంగుల కమలాకర్, సివిల్ సప్లయ్స్ కమిషనర్‌ను కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. వీరి భేటి తర్వాత తడిసి, రంగు మారిన ధాన్యం కొనుగోళ్ల విషయమై మరింత స్పష్టం వచ్చే అవకాశం ఉంది.

రైస్ మిల్లర్లతో సమావేశమైన కలెక్టర్

రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల ద్వారా పంపించే ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రైస్ మిల్లర్లకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. భేటీలో రైస్‌మిల్లర్లు తమ డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తమకు కేటాయిస్తే నష్టాలను చవిచూడాల్సిన ప్రమాదం ఉన్నందున ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు వెనుకంజ వేస్తున్నామని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన మన జిల్లాలో ధాన్యం అన్‌లోడింగ్‌ను నిలిపివేస్తే రైతులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితి గురించి ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం వారు రైస్ మిల్లర్లతో సోమవారం చర్చించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారన్నారు. కావున ధాన్యం నిల్వలను యథావిధిగా అన్‌లోడింగ్ చేసుకోవాలని, రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ రైస్ మిల్లర్లకు సూచించారు. కలెక్టర్ సూచనకు రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందిస్తూ, యథావిధిగా ధాన్యం కొనుగోలుకు సహకరించేందుకు అంగీకారం తెలిపారు.

వరల్డ్ మిక్స్‌బాక్సింగ్ పోటీల్లో శ్రీకాంత్‌కు రజతం



పతకంతో శ్రీకాంత్

నిజామాబాద్‌నాగారం: ప్రపంచ మిక్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారుడు శ్రీకాంత్ రజత పతకం సాధించాడు. ఈ నెల 5 నుంచి 7 వరకు జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని ఇండోర్ స్టేడియంలో ప్రపంచ మిక్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 64 కేజీల కేటగిరిలో శ్రీకాంత్ రజత పతకం సాధించాడు. ప్రస్తుతం గిరిరాజ్ కళాశాలలో ఎంఎస్‌సీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంమోహన్‌రెడ్డి, పీడీ బాలమణి, కోచ్ శ్రీనివాస్‌లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

కేంద్రం కూడా ఎకరానికి రూ. 10వేలు ఇవ్వాలి

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి డిమాండ్



దొన్కల్‌లో నువ్వు పంటను పరిశీలిస్తున్న మంత్రి

మోర్తాడ్(బాల్కొండ): అకాల వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం కూడా ఎకరానికి రూ. 10వేల చొప్పున పరిహారాన్ని మంజూరు చేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనకుండా ఎఫ్‌సీఐ కొర్రీలు పెడుతుందని మంత్రి ఆరోపించారు. ఆదివారం ఆయన దొన్కల్‌లో నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులకు ఆయన ధైర్యం చెప్పారు. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అన్నారు. ఆయన ఉండగా రైతులకు ఎలాంటి కష్టం రానివ్వకుండా కాపాడతాడని చెప్పారు. రైతుల పరిస్థితిని గమనించి పంటలను నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10వేల చొప్పున పరిహారాన్ని మంజూరు చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరారు. జిల్లాలో పంటలను నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. రైతులు ధైర్యం కోల్పోకుండా ఉండాలని తమ ప్రభుత్వం ఉన్నంత కాలం చిన్న కష్టం కూడా రానివ్వమని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ దొన్కల్ సంజీవ్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, తహసీల్దార్ బావయ్య, ఏడీఏ మల్లయ్య, ఏవో లావణ్య పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించండి

వేల్పూర్: జిల్లాలో మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి నడిపించాలని ఆదివారం వేల్పూర్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య ఆధ్వర్యంలో విన్నవించారు. ఈ సందర్భంగా వారు మంత్రికి విన్నవిస్తూ బోధన్ నిజాంషుగర్స్, నిజామాబాద్ కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలు మూతపడి ఏళ్లు గడుస్తున్నాయన్నారు. ఫ్యాక్టరీలను తెరిపిస్తే రైతులకు, కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. బోధన్ ఫ్యాక్టరీని సహకార సంఘం ఆధ్వర్యంలో నడిపేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ గతంలో ప్రకటించారన్నారు. ఒకవేళ ప్రభుత్వం నడపకపోతే 95 యాక్ట్ కింద రైతులకు ఇస్తే, నడుపుకోడానికి సిద్ధంగా ఉ న్నారన్నారు. చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించి, నడిపించడానికి చొరవతీసుకోవాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ సీఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి చర్చిస్తానని హామీ ఇచ్చారని పాపయ్య తెలిపారు.



నందిగామ శివారులో తడిసిన ధాన్యం రాశులు

మళ్లీ కురిసిన వాన

- నీట మునిగిన ధాన్యం రాశులు

నవీపేట: రెండు రోజుల పాటు విశ్రాంతి ఇచ్చిన అకాల వర్షం ఆదివారం మళ్లీ కురిసింది. మండలంలోని యంచ, అల్జాపూర్, నందిగామ్, బినోలలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి 500 ఎకరాల్లోని ధాన్యం రాశులు నీట మునిగాయి. రెండేళ్ల కిందట ఈ ప్రాంతంలోనే వడగళ్ల వాన కురిసి కోతకు వచ్చిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.



క్లుప్తంగా

దేశీదారు పట్టివేత



బోధన్‌టౌన్(బోధన్): రెంజల్ మండలం మహారాష్ట్ర సమీపంలోని కందకుర్తి బ్రిడ్జి వద్ద సీఐ రూప్‌సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం రూట్ వాచ్ నిర్వహించారు. ఈక్రమంలో మహేందర్ రెడ్డి అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి దేశీదారు బాటిళ్లతో బైక్‌పై వస్తుండగా.. తనిఖీలు నిర్వహించి మూడు దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. మహేందర్‌రెడ్డిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు బాటిల్స్ తీసుకు వస్తే చట్టరీత్యా చర్యలతో పాటు కేసు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

గొంతు కోసి పారిపోయారు



నస్రుల్లాబాద్(బీర్కూర్): మండలకేంద్రానికి చెందిన టేకు అంజి అనే యువకుడు ఆదివారం ఊర చెరువు కట్టపైకి వెళ్లగా.. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతడిని కత్తితో గొంతు కోసి పారిపోయారు. స్థానికులు గమనించి గాయపడ్డ యువకుడిని 108అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాధితుడు స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తాడన్నారు. యువకుడి వద్ద ఉన్న నగదు,ఫోన్ కోసమే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని స్థానికులు చర్చిస్తున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం



సుభాష్‌నగర్: నగరంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 10కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేష్ స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలంలోని సుదీర్, మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షాబాజ్ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. నిందితులను పట్టుకొని, వారి నుంచి 10కిలోల గంజాయి, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బడాపహాడ్‌లో భక్తులపై కాంట్రాక్టర్ల దాడి

వర్ని: మండలంలోని బడా పహాడ్‌లో ఆదివారం భక్తులపై కాంట్రాక్టర్లు, పూజారులు ముకుమ్మడి దాడికి పాల్పడ్డారు. దర్గా వద్ద నైవేద్యం సమర్పించడానికి వచ్చిన భక్తులను హుండీలో డబ్బులు వేయాలని, నైవేద్యం సమర్పించినందుకు వేలాది రూపాయలు చెల్లించాలని అటు కాంట్రాక్టర్ ఇటు పూజారులు భక్తులపై ఒత్తిడి తేవడంతో ఘర్షణ జరిగింది. ఘర్షణలో గోవురు గ్రామానికి చెందిన సాకేత్, భూమేష్‌లపై కాంట్రాక్టర్లు, పూజారులకు సంబంధించిన వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్టు బాధితులు వెల్లడించారు. దర్గా వద్ద తాము డబ్బులు ఇవ్వడానికి నిరాకరించినందుకు తమపై దాడి చేసి గాయపరిచినట్లు బాధితులు వెల్లడించారు. సదరు వ్యక్తులపై వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

ఆపదలో అండగా రెడ్‌క్రాస్ !

- కామారెడ్డి జిల్లాలో విస్తరిస్తున్న సేవలు
- నేడు ప్రపంచ రెడ్‌క్రాస్ డే

ఆపదలో నేనున్నానంటూ అండగా నిలుస్తుంది రెడ్‌క్రాస్. సాయమైనా, అభయమైనా చేయూతనందించడంలో ముందువరుసలో నిలుస్తోంది. నేడు ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

సాక్షి, కామారెడ్డి: ఆపదలో ఉన్నవారికి రక్తం అవసరం ఉన్నవారికి రెడ్‌క్రాస్ సంస్థ రక్తం అందిస్తూ.. ప్రాణదాతగా నిలుస్తోంది. అలాగే రక్తదాన శిబిరాలు, ఫస్ట్ ఎయిడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడంలో రెడ్‌క్రాస్ ముందుంటుంది. ఇలా సమాజంలో రెడ్‌క్రాస్ సంస్థ తనవంతు సహకారాన్ని అందజేస్తోంది. కామారెడ్డి జిల్లా ఆవిర్భావం తర్వాత అప్పటి కలెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రస్తుత ఫుడ్ కమిషన్ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి చైర్మన్‌గా 2017 జనవరిలో జిల్లాలో రెడ్‌క్రాస్‌సొసైటీ ఆవిర్భవించింది. అప్పుడు 1,450 మంది సభ్యులతో ప్రారంభించిన సంస్థలో ఇప్పుడు సంఖ్య 4,350కి చేరింది. అనేక సేవా కార్యక్రమాలతో సంస్థ ప్రజల మన్ననలు అందుకుంది. సంస్థలో సభ్యులను పెంచుకుంటూ సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తోంది. సేవా కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొంటున్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందంజ

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించేందుకు దోహదపడ్డారు. అలాగే వర్షాలతో ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్న పలువురు పేదల ఇళ్లకు టార్పాలిన్ కవర్లు అందించారు. అలాగే రెడ్‌క్రాస్ సభ్యులందరూ రెగ్యులర్‌గా రక్తదానం చేస్తూనే ఉన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పలుమార్లు రక్తదానం చేశారు. అలాగే పేదల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలందించారు.



రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్పీ, పక్కన కలెక్టర్ (ఫైల్)

సేవలు విస్తృతపరచాలి



ఆపదలో ఉన్న వారికి రెడ్‌క్రాస్ సొసైటీ ఎప్పుడూ అండగా ఉంటుంది. నిరంతరం సేవలు అందిస్తోంది. మన జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యుల సంఖ్య భారీగా పెరిగింది. అందరూ సేవలు అందిస్తున్నారు. జిల్లాలో సేవలు మరింత విస్తృతం కావలసి ఉంది.

– జితేష్ వి పాటిల్, కలెక్టర్, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్, రెడ్‌క్రాస్ సొసైటీ

సేవల్లో ముందున్నాం



జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీని అప్పటి కలెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కొమ్ముల తిర్మల్‌రెడ్డి చైర్మన్‌గా ప్రారంభించుకున్నాం. ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. ముఖ్యంగా రక్తదాన శిబిరాలతో వేలాది యూనిట్ల రక్తం సేకరించాం. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తాం.

– ఎం రాజన్న, డిస్ట్రిక్ట్ చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ

మరింత ముందుకు వెళతాం



రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. మారుమూల గ్రామాలకు సైతం సేవలను అందిస్తున్నాం. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి వారికి భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. కలెక్టర్ సూచనలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– బాస రఘుకుమార్, డిస్ట్రిక్ట్ సెక్రెటరీ

క్రైం కార్నర్

కలర్స్ వేస్తూ... కానరాని లోకానికి

- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి
- చిన్నదేవడ గ్రామంలో ఘటన

నిజాంసాగర్(జుక్కల్): ఉపాధి కోసం వలస వచ్చిన తండ్రికి ఆసరయ్యేందుకు కుమారుడు రంగులు వేస్తూ సాయపడుతుండగా.. విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఘటన బిచ్కుంద మండలంలోని చిన్నదేవాడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పేయింటర్ దేవకతే రాజేందర్ కరోనా సమయంలో కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పెద్దదేవాడకు ఉపాధి కోసం వలస వచ్చాడు. పెద్దదేవాడతో పాటు చుట్టుపక్క గ్రామాల్లోని కొత్త ఇళ్లకు కలర్స్ వేస్తూ పేయింటర్‌గా గుర్తింపు పొందాడు. రాజేందర్ కొడుకు కార్తీక్(19) లాతూర్‌లో ఇంటర్ పరీక్షలు రాశాడు. వేసవి సెలవులు రావడంతో కొద్దిరోజుల కిందట తండ్రి వద్దకు వచ్చాడు. ఈక్రమంలో చిన్నదేవాడ గ్రామానికి చెందిన సుబ్బురి పోశెట్టి తన కొత్త ఇంటికి రంగులు వేయడానికి రాజేందర్‌కు గుత్తకు ఇచ్చాడు. ఆదివారం కూలీలతో కలిసి కార్తీక్ చిన్నదేవాడలోని ఇంటికి కలర్ వేస్తున్నాడు. ఈక్రమంలో ఇంటిక పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు బ్రష్ తగలడంతో కార్తీక్ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. తనకు ఆసరా అవుతాడని వచ్చిన కుమారుడు కళ్ల ముందే కరెంట్ షాక్‌తో మృతి చెందడటంతో తండ్రి రాజేందర్ గుండెలు అవిసేలా రోదిస్తూ సొమ్మసిల్లి పోయాడు. సమాచారం అందుకున్న బిచ్కుంద ఎస్సై శ్రీధర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతిడి తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.



కార్తీక్ (ఫైల్)

అనుమానాస్పదంగా ఒకరి మృతి

పిట్లం(జుక్కల్): మండలంలోని బోల్లక్‌పల్లి గ్రామ శివారులోగల మంజీర నదిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాలు ఇలా.. మంజీర నదిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు బాన్సువాడ మండలంలోని బుడిమి వాసి ఉప్పరి మహేష్ (30)గా గుర్తించారు. ఉప్పరి మహేష్ శనివారం ఇంటి నుంచి బయలుదేరి ఆదివారం మంజీర నదిలో శవమై తేలాడు. భార్య గుణావతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై విజయ్‌కొండ

తృటిలో తప్పిన ప్రమాదం

మాచారెడ్డి: మండలకేంద్రంలోని కామారెడ్డి–సిరిసిల్లా రహదారిపై ఆదివారం తృటిలో ప్రమాదం తప్పింది. మండలకేంద్రంలో ఆదివారం మాచారెడ్డి వైపు నుంచి కామారెడ్డి వైపు లారీ వెళ్తుండగా.. ఎదురుగా కారు స్పీడ్‌గా వస్తోంది. ఈక్రమంలో లారీని పక్కకు తప్పించాలంటే రోడ్డుకు కుడివైపున గొయ్యి ఉంది. దీంతో లారీ డ్రైవర్ చాకచక్యంగా ఎడమవైపు రోడ్డు కిందకు లారీని దించాడు. దీంతో చెట్టును ఢీకొని కొమ్మ విరిగి లారీపై పడింది. ఎవరికి ఏం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన బండారు వెంకట్‌రెడ్డి పాడి గేదె ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గేదె శుక్రవారం గ్రామ శివారులోకి మేతకు వెళ్లి, తిరిగి రాలేదు. రెండు రోజులుగా గేదె కోసం గ్రామ శివారులో వెతికారు. ఆదివారం పెద్దవాగు పంట చేనుల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె షాక్‌కు గురై మృతి చెందినట్లు గమనించారు. జేఎల్‌ఎం రాజు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. నష్టపరిహారం కోసం పైఅధికారులకు నివేదిక పంపుతానని వివరించారు. గేదె విలువ రూ. 80వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెందిన గేదె

ఎత్తొండలో ఆవు..

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ గ్రామ శివారులో ఆదివారం విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన మఠపతి విశ్వనాథ్‌కు చెందిన ఆవు, దూడ మేత మేసుకుంటు వెళుతుండగా పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు

ఆదివాసీ నాయక్‌పోడ్ జిల్లా కార్యవర్గం

ఆర్మూర్‌టౌన్/నిజామాబాద్‌నాగారం: ఆర్మూర్ పట్టణంలో ఆదివారం ఆదివాసి నాయక్‌పోడ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా ఆదివాసి నాయక్‌పోడ్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాండ్ల రామచందర్, ప్రధాన కార్యదర్శిగా దేగాం సాయన్న, జిల్లా కోశాధికారిగా శానం పవన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోలం గంగాధర్ ఎన్నికైయ్యారు. కార్యక్రమంలో సురేష్, మధుసుదన్, జిల్లా ఉద్యోగ సంఘం బాధ్యుడు పుట్ట రాజేశ్వర్, రమణ, సంజీవ్, రవి గంగాధర్, సుదర్శన్, దుర్గామల్లేష్ పాల్గొన్నారు.



ఆదివాసీ నాయకపోడ్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

'ధన్‌పాల్'కు అయ్యప్ప గురుస్వామి పురస్కారం

సుభాష్‌నగర్: భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ధన్‌పాల్ సూర్యనారాయణ అయ్యప్ప గురుస్వామి పురస్కారాన్ని అందుకున్నారు. మేడ్చల్ జిల్లాలోని పూడురు అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం పురస్కారం ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పురస్కార గ్రహీత ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పురస్కారం రావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమలరావు, కార్యదర్శి పుల్లం రాజు, బాల ఆంజనేయులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న ధన్‌పాల్

చోరీకి గురైన బైక్ సీజ్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో రెండేళ్ల క్రితం చోరీ అయిన బైక్‌ను హైదరాబాద్‌లోని బాలానగర్ పీఎస్ పరిధిలో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. లింగంపేట మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన ఈరన్నగారి రాములు వారి బంధువులను పరామర్శించేందుకు బైక్‌పై 2021జులై 8న ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వచ్చాడు. ఆస్పత్రి ఆవరణలో బైక్ ఉంచి లోనికి వెళ్లివచ్చేలోపు బైక్ చోరీకి గురైంది.

కానీ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఇట్టి బైక్‌ను గత నెల 7న హైదరాబాద్‌లోని బాలానగర్ పీఎస్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్ కేసులో సీజ్ చేయడంతో ఈరన్నకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఈరన్న తన బైక్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వన్నెల్(బి) జెడ్పీహెచ్‌ఎస్ 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్



నల్లవెల్లి జెడ్పీహెచ్‌ఎస్ 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

బాల్కొండ/ఇందల్వాయి/డొంకేశ్వర్(ఆర్మూర్): బాల్కొండ మండలంలోని వన్నెల్(బి) ఉన్నత పాఠశాలలో 1998–99 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అలాగే ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి జెడ్పీహెచ్‌ఎస్ 2003– 04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు, డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో 1997–98 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానం చేశారు. అలాగే విద్యార్థులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.



డొంకేశ్వర్ జెడ్పీహెచ్‌ఎస్ 1997-98 బ్యాచ్ విద్యార్థులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. నాగిరెడ్డిపేట మండలంలో బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరికి, నందిపేట్ మండలంలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే డిచ్‌పల్లి మండలంలో ఆగి ఉన్న లారీని బైక్‌పై వెళ్తున్న యువకుడు ఢీకొని గాయపడ్డాడు.



ప్రమాదంలో ధ్వంసమైన బైక్

బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజరతండా వద్ద ఆదివారం పల్సర్ బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా.. పెద్దకొడప్‌గల్ మండలం బీగంపూర్ గ్రామానికి చెందిన పెంద్యాల విజయకుమార్ తన బైక్‌పై గోపాల్‌పేట వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్నాడు. గోపాల్‌పేట వైపు వెళ్తున్న అంజయ్య కారుతో బైక్‌ను బంజరతండా వద్ద ఢీకొట్టాడు. ప్రమాదంలో విజయ్ గాయపడడంతోపాటు బైక్ పూర్తిగా ధ్వంసమైంది. క్షతగాత్రుడిని స్థానికులు ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. విజయ్ అన్న సుదీర్ ఫిర్యాదు మేరకు అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో..



ప్రమాదంలో గాయపడ్డ యువకుడు


నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వన్నెల్ కే గ్రామ సమీపంలో ఎదురెదురుగా వెళుతున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు స్వల్పగాయాలు అయ్యాయి. మండలంలోని కుద్వాన్‌పూర్ నుంచి వన్నెల్ కే గ్రామం వైపు వెళ్తున్న బైక్, వన్నెల్ కే గ్రామం నుంచి కుద్వాన్‌పూర్ వైపు వెళ్తున్న బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

ఆగి ఉన్న లారీని ఢీకొని..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం గ్రామానికి వెళ్లే మూల మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన గొల్ల రాకేష్ బైక్‌పై డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలోని మల్లన్న ఆలయానికి బయలుదేరాడు. సుద్దులం మూలమలుపు వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో రాకేష్ తలకు తీవ్రగాయాలై రక్తస్రావమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు అందలేదని డిచ్‌పల్లి ఎస్సై గణేష్ తెలిపారు.

కుటుంబకలహాలతో ఒకరి ఆత్మహత్యాయత్నం

భిక్కనూరు: మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బక్కగారి మల్లారెడ్డి ఆదివారం ఉదయం కుటుంబం విషయమై తన భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన మల్లారెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి, అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి ఎల్లారెడ్డిపేట ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మల్లారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. నిర్వహిస్తున్నారు. భిక్కనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న మల్లారెడ్డి

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా.. దేవునిపల్లి కల్కినగర్‌కు చెందిన మడతల పవన్ కల్యాణ్(34) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 6న పవన్‌కల్యాణ్ ఓ శుభకార్యానికి బైక్‌పై వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా.. కామారెడ్డిలోని హైవేపై బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆత్మహత్యకు యత్నించిన ఒకరు..

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన వెనుకదారి భీమయ్య (55) కొద్ది రోజులుగా దేవునిపల్లిలో నివాసం ఉంటున్నారు. అతనికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉండగా మొదటి భార్య చనిపోయింది. అనారోగ్య కారణాలతో పెద్ద కుమార్తె కూడా రెండు సంవత్సరాల క్రితం చనిపోయింది. అప్పటినుంచి మానసికంగా బాధపడుతున్నాడు. అంతేకాకుండా ఆర్థిక సమస్యలు పెరిగాయి. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందిన అతడు ఈనెల 6న ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన ఎలక్ట్రిషియన్ కుంట నాగరాజు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎలక్ట్రిషియన్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు ఆరు నెలల క్రితం కరెంట్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కాగా, వెన్నుపూస విరిగిపోయింది. అప్పటినుంచి గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆదివారం అతడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు.